సాక్షి
ఒడిశా

సోమవారం । 15 । జనవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 6,44,012

- భువనేశ్వర్/పూరీ



పర్లాకిమిడిలో..

పర్లాకిమిడిలో పండగ కళ కనిపించింది. సినీ నటులు కూడా వచ్చారు.

- IIలో.



ఆక్రమణల తొలగింపు

రాయగడలోని పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- IIలో.

న్యూస్‌రీల్

వేంకటేశ్వర ఆలయంలో గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణం జరిపిస్తున్న భద్రం శ్రీనివాసా చార్యులు, చక్రధర్

పర్లాకిమిడి: స్థానిక కోమటి వీధి వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాసం పరిసమాప్తి గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భద్రం శ్రీనివాసా చార్యులు, చక్రధర్ ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు కల్యాణం తిలకించారు.

శ్రీవారికి పండ్లతో అలంకరణ



స్వామివారిని పండ్లతో అలంకరించిన దృశ్యం

రాయగడ: జిల్లాలోని జేకేపూర్ వద్ద గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంక్రాంతిని పురస్కరించుకుని మందిరమంతా వివిధ పండ్లతో అలంకరించారు. చెరుకు, అరటి పండ్ల గెడలతో అలంకరించడంతో మందిరం సుందరంగా కనిపించింది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. మూడు రోజుల పాటుగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు రంగనాథ్ ఆచార్యులు భక్తులతో పూజలు చేయించారు.

జనవరి 17న ప్రభుత్వ సెలవు దినం

భువనేశ్వర్: కొత్తగా నిర్మితమైన పూరీ శ్రీ మందిరం వారసత్వ ప్రాకారం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జనవరి 17వ తేదీని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించారు. ఈ కార్యక్రమం పూర్తి ఆధ్యాత్మిక, ధార్మిక సంప్రదాయాలతో అత్యంత ఉత్సాహంతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భక్తులు సంతోషంగా పాల్గొనేందుకు వీలుగా జనవరి 17న అధికారిక సెలవు దినంగా ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు జనవరి 17న మూతపడనున్నాయి.

కాంగ్రెస్ ఎన్నికల కమిటీలో సప్తగిరి ఉల్కకు స్థానం



తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: రానున్న ఎన్నికల్లో ఒడిశా రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఏఐసీసీ సాధారణ కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ 18 మందితో ప్రదేశ్ ఎన్నికల కమిటీని నియమించారు. ఆ కమిటీలో కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి శంకర ఉల్కకు చోటు దక్కింది.ఈ కమిటీకి అభ్యర్థుల ఎంపికలో పూర్తి స్వేచ్ఛ ఉన్నట్లు భావిస్తున్నారు. అయితే ఆ కమిటీలో తన పేరు లేక పోయినప్పటికీ తాను సిఫార్సు చేసిన వారికి టిక్కెట్లు లభిస్తాయని జయపురం ఎమ్మెల్యే, విధానసభలో పార్టీ చీఫ్‌విప్ తారాప్రసాద్ బాహిణీపతి వెల్లడించారు. అయితే తాను ఎవరినీ సిఫార్సు చేయనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలువగల వ్యక్తులను మాత్రమే తాను కమిటీకి సూచిస్తానన్నారు. ఎన్నికల కమిటీలో తన పేరు లేక పోవటంపై స్పందించిన బాహిణీపతి మీడియా ఎదుట పై వ్యాఖ్యలు చేశారు. కమిటీ ఏర్పాటు సమయంలో తాను పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్‌తో చర్చించానని వెల్లడించారు. కొత్త కమిటీలో యువజన, మహిళా కాంగ్రెస్, ఛాత్ర కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు ఉన్నారన్నారు.

సంబరాల సంక్రాంతి



భోగి మంటలు వేస్తున్న ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్ ప్రతినిధులు



పాయిసం వండుతున్న మేయర్ సంఘమిత్ర, బరంపురం తెలుగు మహిళలు





బరంపురం: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటేలా జరిగాయి. స్థానిక ఆంధ్ర మహిళా సమాజం, ఆంధ్ర భాషవర్ధిని సమాజం, పలు బరంపురం తెలుగు సంఘాల సహకారంతో స్థానిక కాపువీధిలోని ఆంధ్ర మహిళా సమాజం ప్రాంగణంలో నిర్వహించిన సంబరాలు అదిరిపోయాయి. తెలుగు వారంతా ఒక దగ్గరకు చేరి సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బరంపురం ఎంపీ చంద్ర శేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయి పాల్గొన్నారు. కోలాటం, సంక్రాంతి నృత్య గీతాలు, బ్రహ్మం గాన బృందం ప్రదర్శనలు, మోణింగి కామేశ్వర్ హాస్య నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలుగు సంఘాల ప్రతినిధులు పి.సత్యనారాయణ బాబు, తెలుగు సినీ నటులు సాయి కుమార్, మోణింగి కామేశ్వరి, ఎం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గొబ్బిళ్ల పెట్టి..

బరంపురం: బరంపురం వీధుల్లో సంక్రాంతి కళ కనిపించింది. స్థానిక కాళికా అమ్మవారి వీధిలో గల తెలుగు ప్రజలు తమ పిల్లలతో గొబ్బిళ్లు జరుపుకున్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు.

కొరాపుట్‌లో..

కొరాపుట్: తెలుగు ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఆదివారం భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. నబరంగ్‌పూర్ జిల్లాలో తెలుగు ప్రజలు అధికంగా ఉండే చైనా మార్కెట్ లో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని అగ్ని ముట్టించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కౌశల్య ప్రధాని, స్థానిక కౌన్సిలర్ రాజేశ్వరి, మాజీ కౌన్సిలర్లు మట్టా ఉమా మహేశ్వరి, కొత్త కోట శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: పట్టణంలో భోగి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు మంటల వద్ద సందడి చేశారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: స్థానిక రామ్ నగర్‌లో హైటెక్ ప్లాజా వద్ద గత రాత్రి భోగి మంట వేసి హైటెక్ మెడికల్ విద్యాసంస్థల చైర్మన్ తిరుపతి పాణిగ్రాహి, తనయుడు రూపేష్, సురేష్ పాణిగ్రాహిలు ఘనంగా పండగ జరుపుకున్నారు. పర్లాకిమిడి పురపాలక పరిధిలో ఎనిమిదో వార్డు పిన్నింటి పాపయ్యవీధి, అంకావీధి, రేఖానా వీధి, తొమ్మిదో వార్డు కోమటి వీధిలో కళింగ వైశ్యసంఘం సభ్యులు భోగి మంటలు వేసి ఆటపాటలతో భోగిపండుగను ఆనందంగా జరుపుకున్నారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: మల్కన్‌గిరిలో తెలుగువారు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఆదివారం భోగి మంటలు వేశారు. దుర్గా గుడి వీధి, చిదానంద వీధిలో, నక్కిటమ్మ అమ్మవారి ఆలయం వద్ద భోగి మంటలు వేశారు.

జయపురంలో..

జయపురం: స్థానికంగా పలు చోట్ల తెలుగు సంప్రదాయం ప్రకారం భోగి పండగ జరిగింది. తెలుగు వారితో పాటు ఇతర భాషల ప్రజలు కూడా భోగి మంటలు వేశారు.

వీధివీధినా భోగి మంటలు

బరంపురం: నగరంలో వీధివీధినా ఆదివారం భోగి మంటలు కనిపించాయి. స్థానిక పార్క్ వీధిలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ క్లబ్ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు క్లబ్ ప్రతినిధులు భోగి మంటలు వేశారు.



సంక్రాంతి ఉత్సవాల్లో భోగి మంటలు ముట్టిస్తున్న ఎంపీ చంద్ర శేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్, మేయర్ సంఘమిత్ర



గోదాదేవి, శ్రీవేంకటేశ్వర కల్యాణం



సంక్రాంతి ఉత్సవాల్లో జీఎంసీ తెలుగు కార్పొరేటర్లకు గౌరవ సన్మానం చేస్తున్న తెలుగు సంఘాల ప్రతినిధులు



నబరంగ్‌పూర్ చైనా మార్కెట్ భోగి వేడుకల్లో ఎమ్మెల్యే సదాశివ ప్రధాని



సంప్రదాయ దుస్తుల్లో సంక్రాంతి సంబరం



సనతెలి సాహిలో భోగి సందర్భంగా ముగ్గులు వేస్తున్న మహిళలు



కోమటి వీధిలో భోగి మంటల వద్ద పండగ వాతావరణం

కాంగ్రెస్ గూటికి మాజీ సీఎం గిరిధర్ గొమాంగో!

- ఢిల్లీలో ఓపీసీసీ ఎన్నికల పరిశీలకుడిని కలిసిన వైనం



ఓపీసీసీ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ అజయ్ కుమార్‌తో భేటీ అయిన గిరిధర్ గొమాంగో, అతని భార్య, తనయుడు

రాయగడ,భువనేశ్వర్: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగో త్వరలో కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. ఆయనతోపాటు సతీమణి, కొరాపుట్ లోక్‌సభ మాజీ ఎంపీ హేమాగమాంగ్, తనయుడు శిశిర్‌లు కూడా ఆయన బాటలో నడవనున్నారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యాలయానికి శనివారం వెళ్లి ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నికల పరిశీలకులు డాక్టర్ అజయ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో బీజేడీ అధికార పగ్గాలు చేపట్టిన అనంతరం ఆయన రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంలో పడింది. దీంతో కొంతకాలం రాజకీయాలకు దూరంగా గడిపిన ఆయన అనంతరం బీజేపీలో చేరారు. ఆ పార్టీలో కూడా తనకు సరైన గౌరవం లభించకపోవడంతో ఆ పార్టీకి కూడా రాజీనామా చేసి భారతీయ రాష్ట్రీయ సమితి (బీఆర్‌ఎస్) తీర్థం తీసుకున్నారు. అయితే ఆ పార్టీకి ఒడిశాలో సరైన ఆదరణ లభించకపోవడంతో దిక్కుతోచని ఆయన మళ్లీ సొంతగూటికి చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

కాంగ్రెస్‌కు విశేష సేవలు

కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలందించిన గిరిధర గొమాంగో కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి 1972లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం ప్రజల ఆదరాభిమానాలు సంపాదించిన ఆయన 1977, 1980, 1984, 1989, 1991, 1996, 1998, 2004లో వరుసగా ఈ స్థానం నుంచి పోటీ చేసి అలుపెరుగని విజయాన్ని సాధించారు. అయితే ఒడిశాలో బీజేడీ పార్టీ అధికార పగ్గాలు చేపట్టిన తరువాత ఆయన ఓటమిని చవిచూశారు. దీంతో రాజకీయాలకు దూరంగా ఉన్నారు. అయితే కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన ఆయన సతీమణి హేమాగొమాంగో విజయాన్ని సాధించారు. ఒక్కసారి మాత్రమే ఎంపీగా విజయం సాధించిన హేమా గొమాంగో కూడా అనంతరం జరిగిన ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు.

నేడు శ్రీసేతు ట్రయల్ రన్



ట్రయల్ రన్‌కు సిద్ధమైన శ్రీ సేతు

భువనేశ్వర్: శ్రీమందిర్ ప్రాకార పథకం ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో అంకురార్పణ అనుబంధ పూజాదులు రెండు రోజులుగా నిరవధికంగా నిర్వహిస్తున్నారు. లోకార్పణ మహోత్సవం భారీ ఎత్తున నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రధానంగా రాష్ట్రం నలుమూలల నుంచి భక్త జనుల్ని ఆకట్టుకునేందుకు పలు చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో పూరీ శ్రీ మందిరం ప్రాంగణానికి భక్తులు, యాత్రికులు, పర్యాటకులు, సందర్శకుల తాకిడి క్రమంగా పుంజుకుంటోంది. ఈ నెల 17న పూరీ శ్రీ మందిరం వారసత్వ ప్రాకార పథకం లోకార్పణ మహోత్సం అట్టహాసంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా నిర్మించిన శ్రీసేతు సోమవారం తాత్కాలికంగా (ట్రయల్ రన్) ప్రారంభించనున్నారు. లోకార్పణ తర్వాత శ్రీ సేతు గుండా పౌరుల రాకపోకలకు అనుమతిస్తారు. లోకార్పణ మహోత్సవం పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని పూరీ జిల్లా కలెక్టరు సమర్థ వర్మ తెలిపారు.

శ్రీ మందిరంలో మకర సంక్రాంతి

భువనేశ్వర్: పూరీ జగన్నాథ దేవస్థానంలో ప్రత్యేక వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం ప్రత్యేక మకర పూజలు నిర్వహించనున్నారు. ముందు రోజు ఆదివారం నుంచి మూల విరాట్ల ప్రత్యేక అలంకరణ ప్రక్రియ ప్రారంభించారు. ఈ అలంకరణని నవాంక అలంకరణగా పేర్కొంటారు. మకర సంక్రాంతి నాడు మధ్యాహ్న ధూపం, నైవేద్యం తర్వాత ప్రత్యేక సేవాదులు ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా మకర చూల (తలపాగా) అలంకరణ చేస్తారు. అనంతరం గోపాల వల్లభ భోగం, ప్రాతః ధూపం సమర్పిస్తారు. ప్రత్యేక ఆభరణాలతో శ్రీ జగన్నాథ స్వామి మకర చౌరాసి అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారు. మూల విరాట్ల నవాంక అలంకరణ పురస్కరించుకుని సువాసనతో గుభాలించే రంగు రంగుల పూలతో తయారు చేసిన పుష్ప పగిడీల్ని స్థానిక జగన్నాథ వల్లభ మఠం సమకూర్చుతుంది. దీనిలో ప్రధానంగా బంతి పువ్వులు, తులసి దళాలను వినియోగిస్తారు. ఈ అలంకరణలో భాగంగా రత్న వేదికపై ఆసీనులైన బలభద్ర స్వామి, జగన్నాథుడిని జీలుగుతో చేసిన మకరకుండలాలు, నాగలి - కంకి, శంఖ - చక్రాలతో అలంకరిస్తారు.

ముగిసిన పొహాలి భోగ్

ధనుస్సంక్రాంతిని పురస్కరించుకుని ప్రారంభించిన పొహాలి భోగ్ సేవ ఆది వారంతో ముగిసింది. మకర సంక్రాంతి నుంచి గోపాలవల్లభ భోగ సేవ ప్రారంభం కానుంది. నెల రోజులపాటు స్వామికి పొహాలి భోగం నివేదన పురస్కరించుకుని నిత్యం వేకువ జామున శ్రీ మందిరం సింహ ద్వారం తలుపులు తెరిచి ప్రాతఃకాల సేవాదులు ముగించి సుమారు ఉదయం 4.30 గంటలు సరికి మూల విరాటులకు భోగం నివేదిస్తారు.



ఆదివారం సమర్పించిన నైవేద్యం



శ్రీ మందిరం రత్న వేదికపై మూల విరాట్టుల నవాంక అలంకరణ

క్లుప్తంగా

జగన్నాథ్ సాగర్‌ను అభివృద్ధి చేయాలి

జయపురం: చారిత్రాత్మక జగన్నాథ్ సాగరాన్ని వెంటనే పునరుద్ధరించే పనులు చేపట్టాలని కోరుతూ ఆదివారం జయపురం మో జగన్నాథ్ సాగర్ ట్రస్టు ప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. జయపురం అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు దేవేంద్ర బాహిణీపతి నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎన్నేళ్లకెన్నేళ్లకు..

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96 లో టెన్త్ చదివిన వారు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. పలు ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు సంక్రాంతి సందర్భంగా గ్రామాలకు చేరుకుని నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అప్పటి హెచ్‌ఎం ఎం.నీలాంద్రిరావు, ఉపాధ్యాయులు ముంగువుడి శ్రీనివాసరావు, లలితకుమారి, రుక్మిణీదేవి, చంద్రయ్య, సన్యాసీ నాయుడు, చంద్రయ్యలను సన్మానించారు.

కొంగరాం వ్యక్తి శబరిమలైలో అదృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: కొంగరాంకు చెందిన గుండ ఈశ్వరుడు స్థానికులతో కలిసి శబరిమలై అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. ఈ గ్రామం నుంచి 20 మంది వెళ్లారు. ఈ నెల 11 నుంచి ఈయన కనిపించడం లేదు. తోటి భక్తులు వెతుకుతున్నా ఈయన జాడ కనిపించడం లేదు. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. కుమారుడు సైతం అక్కడకు వెళ్లారు.

అందరికీ అయోధ్య అక్షతలు

శ్రీకాకుళం కల్చరల్: రామజన్మభూమి అయోధ్యలో భవ్య మందిర ప్రతిష్ఠాపన మహోత్సవాలలో భాగంగా.. రాముడి అక్షతలను ఊరూరా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని విశ్వహిందూ పరిషత్ ప్రణాళిక ప్రకారం ఈ పంపకం చేస్తున్నారు. నవంబరు నెలలో బాలరామునికి అర్చన చేసిన అక్షింతలు అయోధ్య నుంచి జిల్లాకు రాగా వాటిని శ్రీకాకుళంలోని బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠానికి చేర్చారు. అక్కడి నుంచి ప్రతి గ్రామానికి అందజేస్తున్నారు. జిల్లా కేంద్రంగా మండల స్థాయి, మేజర్ పంచాయితీ స్థాయి, పట్టణ స్థాయిని విభజించి జిల్లాలోని 30 మండలాలకు, మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడ ఉన్న దేవాలయాలకు చేర్చారు. వీటిని అందజేయడంలో భజరంగదళ్, దుర్గా వాహిని, సంఘ వివిధ క్షేత్రాలు, దేవాలయ కమిటీలు, వివిధ ధార్మిక సంఘాలు, భజన బృందాలు, అర్చక, పురోహితులు, యువజన సంఘాలు, యువతి, యువకులు ఈ మహాకార్యంలో భాగస్వాములయ్యారు.

5 లక్షల గృహాలకు అందజేత

జనవరి 1వ తేదీ నుంచి ఇంటింటికీ పంపిణీ మొదలుపెట్టారు. ఇప్పటి వరకు 5లక్షల గృహాలకు అక్షతలను విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు అందజేశారని నిర్వాహకులు చెబుతున్నారు. మిగిలిన వాటిని కూడా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్షతలతో పాటు, అయోధ్య రామాలయ చిత్రపటం, ఆహ్వాన కరపత్రం అందజేస్తున్నారు.

ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు

రామమందిర ప్రతిష్ఠాపనకు అందరూ వెళ్లే వీలు లేని నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని టెలివిజన్, డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు ద్వారా వీక్షించడానికి గాను ఎక్కడికక్కడ దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా టెక్కలి యోగా కేంద్రంలో, ఆమదాలవలస వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే దూరదర్శన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం, తదితర ప్రైవేటు చానల్స్ ప్రసారం కూడా ఉంటుంది.

నేటి నుంచి గ్రామాల్లో జాతరలు

జి.సిగడాం: సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో జాతర్ల సందడి నెలకుంది. మెట్టవలసలోని ఏకశిలా పర్వతంపై వెలసియున్న మల్లికార్జున స్వామి యాత్ర మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాటు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను గ్రామ పెద్దలు ఏర్పాటు చేశారు. అలాగే గెద్దకంచరాం గ్రామంలో ఈనెల 16 తేదీ నుంచి పైడితల్లిమ్మవారి యాత్ర మహోత్సవాలు జరుగుతాయి. ఏటా కనుమ రోజు నుంచి మూడు రోజులు ఉత్సవం జరుగుతోందని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మధుపాం గ్రామంలోని దుర్గాదేవి అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 17 నుంచి 19వతేదీ వరకు జరుగుతాయి. జాతర్ల సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

21న జిల్లాస్థాయి క్రికెట్ అంపైర్లు, స్కోరర్ల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో నిర్వహించనున్న పలు క్రికెట్ టోర్నమెంట్‌లకు అవసరమయ్యే జిల్లాస్థాయి అంపైర్లు, స్కోరర్ల కోసం ఈనెల 21వ తేదీన ఎంపిక పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శి వైఎస్ శాస్త్రి, హసన్ రాజా తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుషులు/మహిళలు అర్హులని పేర్కొన్నారు. క్రికెట్‌పై అవగాహన, పరిజ్ఞానం కలిగి వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ల కోసం నిర్వహించే క్వాలిఫైయింగ్ టెస్టులకు కూడా పంపిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు హాజరు కావాలని వారు కోరారు.

పర్లాకిమిడిలో పండగ కళ



ఆకట్టుకున్న కళాకారుల డ్యాన్స్



మోహన్‌దాస్ ఏకపాత్రాభినయం



డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి జీవిత చరిత్రపై రాసిన సంపుటిని విడుదల చేస్తున్న సాయికుమార్

- హైటెక్ ప్లాజా వద్ద ఘనంగా సంక్రాంతి వేడుకలు
- ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ నటుడు సాయికుమార్

పర్లాకిమిడి: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పర్లాకిమిడిలో హైటెక్ ప్లాజా గ్రౌండ్స్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి వేడుకలకు సినీ నటుడు, డైలాగ్ కింగ్ సాయికుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జగన్నాథ్ డ్యాన్స్, మోహన్‌దాస్ దుర్యోధన ఏకపాత్రాభినయం, ఫ్లూట్ కళాకారులు వెల్లంకి కూర్మనాథం, చైతన్య డ్యాన్స్ స్కూల్ కళాకారులు డ్యాన్సులు అదరహో అనిపించాయి. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ఒడిశాలో పర్లాకిమిడి ప్రవాసాంధ్రులు సంక్రాంతి వేడుకలకు ఆహ్వానించినందుకు హైటెక్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతి పాణిగ్రాహికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ తిరుపతి పాణిగ్రాహిపై రచించిన కథాసంపుటిని సాయికుమార్ ఆవిష్కరించారు. కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వి.ఎస్.ఎన్.రాజు, హైటెక్ గ్రూప్స్ ఎండీ రూపేష్ పాణిగ్రాహి, సురేష్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఆక్రమణల తొలగింపు



రైల్వే స్థలంలోని భీమోవీధి ప్రాంతం

- రైల్వే అధికారులు సన్నాహాలు

రాయగడ: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో రైల్వే స్థలాల్లో ఆక్రమణలో ఉన్న ఇళ్లను వారం రోజుల్లో తొలగించేందుకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు తుది గడువుగా స్థానిక జగన్నాథ మందిరం ఎదురుగా ఉన్న భీమోవీధి, కేఎన్‌సీ ఎదురుగా గల ప్రాంతాల్లోని ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు నోటీసులు జారీ చేశారు. కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలోని రైల్వే స్థలాలను ఆక్రమించుకుని చాలామంది పక్కా ఇళ్లను కట్టుకుని జీవిస్తున్నారు. అయితే రైల్వే డివిజన్‌గా రాయగడ గుర్తింపు పొందడంతో అందుకు అనుగుణంగా కార్యాలయాలు, సిబ్బంది క్వార్టర్స్ తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు రైల్వే శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలోనే కొద్ది నెలల క్రితం స్థానిక భొగ్గులు వీధి, అభినందన్ మండపానికి సమీపంలోని ఇళ్లను తొలగించారు. ఇప్పుడు ప్రధాన ప్రాంతాల్లో రైల్వే స్థలాల్లో ఉన్న వాటిని ఖాళీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కొండనెక్కగలవా..



కొండపై సంగమేశ్వర ఆలయానికి చేరుకునే మెట్లు

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండల మధ్య అతిపెద్ద కొండపై సంగమేశ్వర ఆలయం సంబరానికి సిద్ధమైంది. ఈ కొండను సంగమయ్య కొండ అని, గోపకొండ అని కూడా పిలుస్తారు. ఇక్కడ జాతర ఆనవాళ్లు 12వ శతాబ్దం నుంచి ఉన్నాయని చెబుతుంటారు. జైనం, శైవం, బౌద్ధం కూడా ఇక్కడ విలసిల్లిందని ప్రతీతి. సంగమేశ్వర కొండ దిగువన గొల్లభామగా పిలిచే స్త్రీ దేవతా విగ్రహం ఉంటుంది. 164 మెట్లు ఎక్కి పైకి వెళితే కొండ నట్ట నడుమ భాగంలో 25 అడుగుల లోపలికి ఒక గుహ ఉంది. ఈ గుహలో ఆరు అడుగుల ఎత్తున్న పురుషాకృతి కలిగిన విగ్రహం, దానిముందు ఒక శివలింగం, నంది, దుర్గాదేవి, విఘ్నేశ్వర విగ్రహాలు ఉంటాయి. ఇవికాక ఆలయం మొదటిభాగంలో ప్రవేశం వద్ద నంది విగ్రహం, కుడి పక్కన బౌద్ధ విగ్రహం, ఎడమవైపున పెద్ద బుద్ధుని విగ్రహం కనిపిస్తాయి. ఈ కొండపై 150 ఏళ్ల క్రితం చిన్న దేవాలయం, 111 ఏళ్ల క్రితం మెట్ల నిర్మాణాలు జరిగాయని పెద్దలు చెబుతుంటారు. కొండ దిగువ నుంచి చూస్తే కొండ మెట్లు, దేవాలయం సర్పాకారం పోలి ఉంటాయి. ఆలయానికి చేరువలో పెద్ద మర్రి చెట్టు, వేప చెట్లు ఉన్నాయి.

ఏటా సంక్రాంతి జాతరలు

సంగమయ్య కొండ వద్ద ఏటా సంక్రాంతికి జాతర చేయడం ఆనవాయితీ. సంక్రాంతి మొదలుకుని కనుమ, ముక్కనుమ రోజుల్లో మూడు రోజుల పాటు వైభవంగా జాతర జరుగుతుంది. రాష్ట్రంలో మొదటి జాతర అయినందున జిల్లా నుండే కాక ఇతర జిల్లాలు, పక్క ఒడిశా రాష్ట్రం నుండి చాలా మంది యాత్రికులు వస్తారు. ఈ జాతరకు సుమారు 2 లక్షల మంది హాజరవుతారు. సంగమేశ్వర కొండ పైభాగంలో ఉన్న ఆలయం ఎడమ పక్కన ఓ బావి ఉంటుంది. ఈ బావిలో దేవాలయానికి వచ్చే ప్రతి భక్తుడు కూడా చిల్లర డబ్బులు వేసి తమ మొక్కులు తీర్చుకుంటారు.

ఈవీఎంలపై అవగాహన



ప్రదర్శన ప్రారంభిస్తున్న కలెక్టర్‌స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: ఓటర్లు తమ ఓటు హక్కు కోసం వినియోగించే ఈవీఎం, వి.వి.ప్యాట్‌ల పనితీరుపై అవగాహన పెంచేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనరు ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. దీనిని జిల్లా పాలనాధికారి స్మృతి రంజన్ ప్రధాన్ ఆదివారం ప్రారంభించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 28 వరకూ అన్ని సమితి కేంద్రాలు, కాశీనగర్ ఎన్‌ఏసీ, పర్లాకిమిడి పురపాలక పరిధిలోని వివిధ వార్డుల్లో ఈ.వి.ఎం.లు వి.వి.ప్యాట్‌ల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఎన్నికల డిప్యూటీ కలెక్టర్ తృప్తిమయి జెన్నా తెలిపారు. కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు, ఏడీఎం రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండా, అదనపు కలెక్టర్ మంజులతా బెహరా పాల్గొన్నారు.

చైనా మాంజా నిషేధం

భువనేశ్వర్: మకర సంక్రాంతి పురస్కరించుకుని సోమవారం కటక్ నగరంలో గాలిపటాలు ఎగురవేయడంపై ప్రత్యేక ఆంక్షలు విధించారు. గాలిపటాలు ఎగుర వేసేందుకు వినియోగించే ప్రత్యేక పూత దారం (చైనీస్ మాంజా) నిషేధించారు. గాజు రజను పూసిన సింథటిక్ దారంతో గాలిపటాలు ఎగుర వేస్తున్న సందర్భాల్లో ప్రాణాంతక సంఘటనలు పండగ పూట విషాదం మిగిల్చాయి. ఈ నేపథ్యంలో చైనా మాంజా దారాలను ఉపయోగించి గాలిపటాలు ఎగురవేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కటక్ నగర అదనపు డీసీపీ అనిల్ మిశ్రా ఆదివారం మీడియాకు తెలిపారు. ఎవరైనా దుకాణదారుడు వీటిని విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.గత 2021 డిసెంబర్‌లో కటక్ పీర్‌బజార్‌లో అత్తవారింటికి భార్యతో కలిసి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మెడకు తెగిన గాలిపటం చైనీస్ మాంజా దారం చుట్టుకుని మరణించడం అప్పట్లో సంచలనం రేపింది. 2016లో సదర్ పోలీసు ఠాణా పరిధిలోని తెలంగాపెంట వద్ద ఏడేళ్ల బాలిక గొంతు తెగి మృతి చెందింది. ఈ నేపథ్యంలోనే చైనా మాంజాపై నిషేధం విధించారు.

స్నేహితుడి కుటుంబానికి చేదోడు

జలుమూరు: తమతో కలిసి చదువుకున్న స్నేహితుడికి కష్టం వస్తే.. తోటివాళ్లంతా కలిసి ఆదుకున్నారు. నగిరికటకం పంచాయతీ పరిధి మెట్టపేటకు చెందిన ఊట కృష్ణ బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికే పరిమితమయ్యాడు. దీనికి తోడు కృష్ణ తండ్రి శిమ్మన్న దివ్యాంగుడు, ఆపై న తల్లి కూడా మృతి చెందింది. ఈ నేపథ్యంలో కృష్ణ భార్య మోహినిపైనే కుటుంబ భారమంతా పడింది. కృష్ణ పూర్తిగా కోలుకునేందుకు అధిక మొత్తం డబ్బుతోపాటు సుమారు ఏడాది సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న శ్రీముఖలింగం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, కృష్ణ స్నేహితులు విరాళాలు సేకరించి మోహినికి రూ.75వేలు అందజేశారు.

రెండు వర్గాలపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : గడ్డి ట్రాక్టర్ బైక్‌కు తగిలిన ఘటనలో రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయి. దీంతో ఆ రెండు వర్గాలపై కేసు నమోదు చేశామని ఒకటో పట్టణ ఎస్‌ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. నగరంలోని హయాతి నగరానికి చెందిన దుక్క శ్రీనివాసరావు గేదెల పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. గేదెల మేత కోసం ట్రాక్టర్‌తో గడ్డి లోడు తెప్పించారు. అది అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా శెగిడివీధి రామ మందిరం వద్ద శెగెళ్ల కూర్మమణి, జికేల్‌ల వెస్పా స్కూటర్‌కు ట్రాక్టర్ తగిలింది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బరంపురం : బరంపురం పోలీసు జిల్లా ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ఇంజినీరింగ్ స్కూల్ రోడ్ జంక్షన్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదకరమని, హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో పోలీసులు

జయపురం: సబ్ డివిజన్‌లో రెండు చోట్ల భారీ ఎత్తున గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. జయపురం పాత్రోపుట్ కూడలి వద్ద అమ్మేందుకు సిద్ధంగా ఉంచిన 252 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కుంభిగుడ గ్రామానికి చెందిన భాగు మఝిని అరెస్టు చేశారు. అదే విధంగా, కొట్‌పాడ్ పరిధిలో కారులో తరలిస్తున్న 52 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

ఉల్లాసంగా క్రికెట్ మ్యాచ్



భద్రగిరి మురళీధర్‌కుమార్, ఎండీ సురేన్ హక్‌ను సత్కరిస్తున్న క్రికెట్ సంఘ ప్రతినిధులు హసన్‌రాజా, ఇలియాస్, శైలానీ, ప్రవీణ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రికెటర్లలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకే పాతతరం, కొత్తతరం క్రికెటర్ల కలయికతో ఏటా భోగి రోజున ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహిస్తున్నామని జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి షేక్ హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానంలో ఆదివారం ఫ్రెండ్లీ మ్యాచ్‌ను నిర్వహించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు దివంగత క్రికెటర్లు డాక్టర్ జీవీ రాజారెడ్డి, మీర్ మహ్మద్, ఓరుగంటి కమలాకర్, బత్తుల రమణ, ఇషాక్ మహ్మద్, టీఎంఎస్ ప్రకాష్ అలియాస్ ముని తదితరులకు నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. పాతతరం, కొత్తతరం క్రీడాకారులు పాల్గొన్నారు. సెక్రటరీ లెవన్, ప్రెసిడెంట్స్ లెవన్ రెండు జట్లుగా విభజించి 20 ఓవర్ల చొప్పున టీ–20 మ్యాచ్‌ను నిర్వహించారు. సెక్రటరీ లెవన్ గెలిపొందింది. ఈ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ జాయింట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, వి.మధుసూదన్, సీనియర్ క్రికెటర్, మెంటర్ ఇలియాజ్ మహ్మద్, అండర్ –16 జట్టు కోచ్ మేఘనాథ్, కొట్టిశ కిరణ్, ఎంవీ రమణ, జిల్లా క్రికెట్ సంఘం యోగా కోచ్ బెండి సురేష్, సీనియర్ క్రికెటర్లు జేమా, బద్రిగిరి వసంత్, జీఎస్ ఎస్ ప్రసాద్, విజయభాస్కర్, ఆంధ్రా అసోసియేషన్ మాజీ కోచ్ కె.ఆదర్శ, వై.ఉమామహేశ్వరరావు, పొందూరు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వై.ఉమామహేశ్వరరావు, సీనియర్ క్రికెటర్ బద్రగిరి మురళీధర్ కుమార్, జిల్లా అసోసియేషన్ మాజీ సెక్రటరీ ఉరెన్ హక్, వీవీఆర్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్ అనంతరం జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి షేక్ హసన్ రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ మాట్లాడుతూ గత సీజన్‌లో జిల్లా నుంచి రంజీ క్రికెటర్లతో కలిపి మొత్తం 9 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఏసీఏ ఆంధ్రా జట్లకు ప్రాతినిధ్యం వహించిన విషయాన్ని గుర్తుచేశారు. రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సహకారంతో క్రికెట్ అభివృద్ధికి అనేక ప్రణాళికలు తయారు చేస్తున్నామని వివరించారు.

లక్షమందితో తూర్పుకాపు గర్జన



నినదిస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఫిబ్రవరి నెల మొదటి వారంలో శ్రీకాకుళం నగరంలో లక్షమందితో తూర్పు కాపు గర్జన పేరుతో భారీ సదస్సు ఏర్పాటు చేస్తామని తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు, డోల జగన్, శాసపు జోగి నాయుడు, ఆనేపు రామకృష్ణ, ఉకలాపు రవి, గేదెల శంకరరావు, లంక గాంధీ, లోలుగు వెంకట రాజశేఖర్, ఎం.శంకర్‌నారాయణలు తెలిపారు. వారు శ్రీకాకుళం నగరంలో తూర్పు కాపు భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఉద్యోగ పర్వంగా తూర్పు కాపు జాతి వెనుకబడి ఉందని అన్నారు. ఈ స్థితి నుంచి బయట పడాలంటే ఒక్క రాజకీయ అధికార సాధనే ముఖ్యమని భావించి ఈ గర్జన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు, వర్గ వైషమ్యాలకు అతీతంగా జరుగుతున్న ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన వారంతా హాజరు కావాలని వారు కోరారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు కిల్లారి నారాయణరావు, కురిటి దుర్గారావు, దువ్వ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బీరువా ఎత్తుకెళ్లిపోయారు

- తిమడాంలో భారీ చోరీ
- 39 తులాలు బంగారం, 4 కేజీలు వెండి, నగదు రూ.50 వేలు అపహరణ



సంఘటన స్థలం వద్ద పరిశీలిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు



ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ పారినాయుడు, సిబ్బంది

జలుమూరు: తిమడాం గ్రామంలో భారీ చోరీ జరిగింది. దొంగలు ఏకంగా బీరువాకు బీరువానే ఎత్తుకెళ్లిన వైనం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిమడాం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బరాటం ప్రసాదరావు ఇంటిలో 39 తులాలు బంగారం, నాలుగు కేజీలు వెండి, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రసాదరావు మామయ్య ఇటీవల సైరిగాం పంచాయతీ పరిధి లింగంనాయుడుపేటలో మృతి చెందారు. ఈ క్రమంలో ప్రసాదరావు తిమడాం నుంచి లింగంనాయుడుపేట తరచూ వెళ్లి వస్తుండేవారు. ఈ నెల 2వ తేదీన ఆయన లింగంనాయుడుపేట నుంచి తిమడాం వచ్చారు. ఇల్లు శుభ్రం చేసి మళ్లీ లింగంనాయుడుపేట వెళ్లిపోయారు. భోగి పండుగ చేసుకుందామని ఆదివారం తిమడాం వచ్చి ఇంటి తాళాలు తీసి చూశారు. ఇంటిలో సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉండడం చూసి కంగారు పడ్డారు. ఇంటిలో ఉండాల్సి బీరువా కనిపించక పోవడం, ఇంటి వెనుక భాగం నుంచి చట్రాలకు అడ్డంగా ఉన్న రాడ్‌ను తొలగించడం చూసి నిశ్చేష్టులైపోయారు. ఆ బీరువాలో 39 తులాలు బంగారం, నాలుగు కేజీలు వెండి వస్తువులు, రూ.50 వేలు నగదు ఉన్నాయని ఆయన చెబుతున్నారు. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి, క్లూస్ టీమ్ సీఐ బూర ప్రసాదరావు, జలుమూరు ఎస్‌ఐ పి.పారినాయుడు, సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి దర్యాప్తు మొదలుపెట్టారు. పరిసర ప్రాంతాలతో పాటు ఇంటికి సమీపంలో ఉన్న అన్ని ఇళ్లను పరిశీలించారు. బీరువాను ఇంటికి వెనుక మార్గం నుంచి వంశధార కాలువ నుంచి తీసుకెళ్లారా.. ఏదైనా వాహనం ద్వారా తీసుకెళ్లారా అన్నది పరిశీలిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు. ఏఎస్పీ విఠలేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా దొంగలను పట్టుకుంటామన్నారు.

20 బస్తాల ధాన్యం దగ్ధం

కాశీబుగ్గ: పలాస పెద్దవీధిలోని తెలుకల రాసమ్మకు చెందిన 20 బస్తాల ధాన్యం ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సీతమ్మగుడి సమీపంలో రాసమ్మకు చెందిన 2 ఎకరాల పొలం ఉంది. పండించిన ధాన్యాన్ని పొలంలో ఉంచగా ప్రమాదవశాత్తు అగ్గి అంటుకుని ధాన్యం బస్తాలు కాలిపోయాయి. స్థానికులు రాసమ్మకు సమాచారం అందించగా.. ఆమె వచ్చి చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం పలాస అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు.



మిగిలిన ధాన్యం సేకరిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

సారాబట్టీలపై పోలీసుల దాడులు



సారాతయారీకి సిద్ధం చేసిన బెల్లంఊటను పారబోస్తున్న పోలీసులు

లక్ష్మీవరపుకోట: మండలంలోని రేగ గ్రామ సమీపంలోని సారాబట్టీలపై ఆదివారం పోలీసులు దాడులు చేపట్టారు. ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో 750 లీటర్ల బెల్లంఊటను స్వాధీనం చేసుకుని, ధ్వంసం చేశారు. సారాతయారీ సామగ్రిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు వస్తున్నట్లు తెలుసుకున్న సారా తయారీదారులు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

17న కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల కబడ్డీ పోటీలకు సంబంధించి, జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు దొర, కె.వి. ప్రభావతి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. నగరంలోని సిటీ క్లబ్ ప్రాంగణంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే పురుషులు 70 కేజీల లోపు, మహిళలు 65 కేజీల లోపు బరువు కలిగి ఉండాలన్నారు. 2024 మార్చి తర్వాత పుట్టిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు నంద్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9949721949ను సంప్రదించాలని కోరారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

సంతకవిటి: శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గాడి తిరుపతిరావు(60)అనే వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ ఎం.వాసుదేవరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మద్యానికి బానిస అయిన అతడిని ఇలా తాగితే మనమెలా బతుకుతామని కూతురు మందలించడంతో ఈ నెల 12వ తేదీన అతడు పురుగుమందు తాగాడు. ఇదే విషయాన్ని అతడు మరునటిరోజు ఉదయం ఇంట్లో వారికి చెప్పడంతో వారు చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఉదయం చనిపోయాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

పూరిల్లు దగ్ధం



బాడంగి: కాలిపోతున్న పూరిల్లు

బాడంగి: మండలంలోని పి.వెంకంపేట గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో నంద్యాల సింహాచలం అనే వ్యక్తికి చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఆదివారం రాత్రి జరిగిన ఇదే ప్రమాదంలో గ్రామానికి చెందిన అల్లు నారాయణరావుకు చెందిన పశువుల శాల కొంతమేర కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన తహసీల్దార్ రఫీజాన్ సోమవారం రెవెన్యూ సిబ్బంది ప్రమాద స్థలాన్ని సందర్శించి, జరిగిన నష్టాన్ని అంచనా వేస్తారని తెలిపారు.

100 బస్తాల ధాన్యం..



బొబ్బిలి: ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు, తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: స్థానిక పట్టణ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో రైతు బి.సూరినాయుడుకు చెందిన 100 బస్తాల ధాన్యం పూర్తిగా కాలిపోయాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిన తర్వాత నష్టపోవడం పట్ల బాధిత రైతు తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, బాధితుడిని కలిసి పరామర్శించారు. అనంతరం ప్రమాద ఘటనపై ఆరాతీశారు.

60 మద్యంసీసాల స్వాధీనం

భోగాపురం: మండల కేంద్రంలోని ముక్కాం జంక్షన్ వద్ద ఆదివారం చేపట్టిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 60 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు. భోగాపురం నుంచి ముక్కాం వైపు వస్తున్న ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా, మద్యంబాటిళ్లు పట్టుబడ్డాయని పేర్కొన్నారు. ఇదే ఘటనకు సంబంధించి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

సూక్ష్మ సేద్యానికి.. సర్కారు సహకారం

- 50 నుంచి 90 శాతం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు
- చిన్న, సన్నకారు రైతులకు అధిక ప్రాధాన్యం
- రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన సాగు విస్తీర్ణం 1800 హెక్టార్లు
- 425 హెక్టార్లలో సూక్ష్మ సేద్య పరికరాల అమరిక
- పరికరాల కోసం రూ.11.35 కోట్ల ఖర్చు



మొక్కజొన్న తోటల్లో బిందుసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు



బంతితోటకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన సూక్ష్మసేద్యం పరికరాలు

పాలకొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అనుక్షణం అండగా నిలుస్తోంది. మారుతున్న యాంత్రిక యుగంలో సాంకేతికతను అందిపుచ్చుకుని వినూత్న విధానాల్లో సాగు చేపట్టేలా చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగుకు అనువుగా 50 నుంచి 90 శాతం రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు సమకూర్చుతోంది. ఎకరా నుంచి 5 ఎకరాల భూమి గల రైతులకు 55 శాతం, 5 నుంచి 12.50 భూమి గల రైతులకు 45 శాతం రాయితీపై స్ప్రింక్లర్ల యంత్రాలు అందిస్తోంది. గిరిజన రైతులకు 90 శాతం రాయితీని కల్పిస్తోంది. జిల్లాలో ప్రస్తుతం1800 వందల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యానికి సంబంధించి రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో 425 హెక్టార్లలో రాయితీ పరికరాల అమరిక పనులను అధికారులు పూర్తి చేశారు. 12 వందల మంది రైతులకు లబ్ధికల్పించేలా సుమారు రూ.11.35 కోట్ల నిధులతో రాయితీ పరికరాలు సమకూర్చేందుకు ప్రభుత్వం రంగం సిద్ధంచేసింది. మరో 600 హెక్టార్లలో పరికరాలు అమర్చేందుకు చర్యలు చేపట్టింది.

లాభాలు బోలెడు..

జిల్లాలోని నేలలు సూక్ష్మసేద్యానికి అనువైనవి. పామాయిల్, అరటి, మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటా, కూరగాయలు, మిరప, చెరకు, వేరుశనగ, మినుము పంటలను బిందు, తుంపర సేద్యంతో సాగుచేయవచ్చు. విద్యుత్, నీటిని పొదుపుగా వాడుకునేందుకు అవకాశం ఉంటుంది. ఎరువులు, పురుగుమందుల యాజమాన్యం సులభం. పంట దిగుబడులు ఆశాజనంగా ఉంటాయి.

బిందు సేద్యం పరికరాలకు రాయితీలు ఇలా....

ఐదెకరాలలోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు పొందవచ్చు. ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.2.18 లక్షల వరకు రాయితీ వస్తుంది. ఐదు నుంచి 12.50 ఎకరాల భూమి గల రైతులు 50 శాతం రాయితీతో బిందుసేద్యం పరికరాలు తీసుకోవచ్చు. ఒక్కో రైతుకు గరిష్టంగా రూ.3.10 లక్షల వరకు రాయితీ వర్తిస్తుంది.

తుంపర సేద్యం (స్ప్రింక్లర్లు)పై రాయితీ ఇలా....

సన్న, చిన్నకారు రైతులు స్ప్రింక్లర్ పరికరాలను 55 శాతం రాయితీపై పొందవచ్చు. ఐదు నుంచి 12.50 ఎకరాల రైతులకు 45 శాతం రాయితీపై పరికరాలు తీసుకోవచ్చు. రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు తీసుకున్న రైతులు 7ఏళ్ల తర్వాత రెండో పర్యాయం సబ్సిడీపై పరికరాలు పొందే వెసులుబాటు కల్పిస్తున్నారు.

దరఖాస్తు చేసుకునే విధానం....

- రైతులు తమ ఆధార్ కార్డు, తహసీల్దార్ ద్వారా ధ్రువీకరించబడిన భూమి యాజమాన్య పత్రం, వన్‌బీ రికార్డుతో రైతు భరోసా (ఆర్బీకే) కేంద్రంలో బయోమెట్రిక్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ సమయంలోనే పరికరాలు పొంద దలచిన కంపెనీ పేరును నమోదు చేయించాలి.
- దరఖాస్తులో తప్పనిసరిగా రైతు తన సెల్ నంబర్ నమోదు చేయాలి. సబ్సిడీ, నాన్ సబ్సిడీ వివరాలను నేరుగా రైతు ఫోన్‌కు మెసేజ్ ద్వారా తెలియజేస్తారు.
- వెబ్ ల్యాండ్ పోర్టల్‌లో చేర్చిన పొలం విస్తీర్ణం ఆధారంగా సబ్సిడీ అర్హత నిర్ణయిస్తారు.

రైతులకు మేలు



క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆర్బీకేల ద్వారా ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకుని నిబంధనల మేరకు నగదుచెల్లిస్తే ఫిబ్రవరి రెండవ వారంలో పరికరాలు అందిస్తాం. దరఖాస్తు చేసే సమయంలో ఏ కంపెనీ పరికరాలు కావాలో రైతులు ఎంచుకోవచ్చు. ఎంపిక చేసుకున్న కంపెనీ ద్వారానే డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు పొలంలో అమరిక చేయిస్తాం. ప్రస్తుతం జిల్లాలో ఫినోలెక్స్, రుమంతా, నెటాఫిమ్ కంపెనీలకు చెందిన సూక్ష్మసేద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయి. సూక్ష్మసేద్యం రైతుకు లాభదాయకం. ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కె.సత్యనారాయణ రెడ్డి, సూక్ష్మ సేద్యం పథక సంచాలకుడు, పార్వతీపురం మన్యం జిల్లా

నెల్లిమర్ల టీడీపీలో అంతర్గత కుమ్ములాట



మాజీ ఎమ్మెల్యే పతివాడ ఇంటి వద్ద సమావేశమైన టీడీపీ నేతలు చిన్నంనాయుడు, సన్యాసినాయుడు

పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజకవర్గం టీడీపీలో అంతర్గత కుమ్ములాటలు తారాస్థాయికి చేరాయి. సంక్రాంతి వేళ డెంకాడ మండలంలోని సేరిపాలెం టీడీపీ నేత వెంపడాపు సూర్యనారాయణ కుమారుడు రమేష్‌నాయుడు పేరిట ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటయ్యాయి. ఫ్లెక్సీలో పూసపాటిరేగ మండలానికి చెందిన టీడీపీ నేతల ఫొటోలు అనుమతి లేకుండా వేయడంతో మండల టీడీపీ నాయకులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. పూసపాటిరేగ మండలం, చల్లవానితోటలో మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి ఇంటి వద్ద ఆదివారం ఉదయం జరిగిన ఓ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎం.చిన్నంనాయుడు, ఎం.శంకరరావు, పి.సన్యాసినాయుడు, విక్రం జగన్నాథం తదితర టీడీపీ నేతలు ఫ్లెక్సీల ఏర్పాటుపై అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని సన్యాసినాయుడు అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో వెంపడాపు రమేష్‌నాయుడును ఎప్పుడూ చూడలేదని, దొడ్డిదారిన రాజకీయాలు చేయడమేంటని అన్నారు. ఫ్లెక్సీల ఏర్పాటు వెనుక టీడీపీలో కీలకనేతలు ఎవరైనా ఉన్నారనే చర్చ జోరుగా జరుగుతోంది. ఏది ఏమైనా నియోజకవర్గ టీడీపీలో రెండు గ్రూపుల మధ్య ఎంతోకాలంగా ఉన్న విభేదాలు ఫ్లెక్సీ ఏర్పాటుతో చెలరేగిన గొడవలో బహిర్గతమయ్యాయని అంతా అనుకుంటున్నారు.

కూల్‌డ్రింక్ అనుకుని, పురుగుమందు తాగిన విద్యార్థి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- బొర్డగూడ గ్రామంలో విషాదం



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థి బినయం



బినయం(ఫైల్)

భామిని: కూల్‌డ్రింక్ అనుకుని, పురుగుమందు తాగి బిడ్డిక బినయం(12) అనే విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని బొర్డగూడ గిరిజన గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. భామిని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బినయం సంక్రాంతి సెలవులకు గ్రామంలోని ఇంటికి వెళ్లాడు. ఇంటి పెరటిలోని పశువుల శాలలో దాచిపెట్టిన టిన్‌లో(డ్రింక్ బాటిల్)లో రైతు పురుగుమందు నిల్వ చేశాడు. అదే శాలకు ఉదయం వెళ్లిన సదరు విద్యార్థి ఆ బాటిల్‌ను చూసి, డ్రింక్ అనుకుని తాగేశాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురి కాగా, వైద్య సేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో భామిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం ఉన్నత వైద్యం కోసం సీతంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడే వైద్యం అందిస్తుండగా, మరణించాడు. పండగ పూట కొడుకు మరణంతో బాధిత తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యార్థి తల్లి సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిట్టిపోలు ప్రసాద్ తెలిపారు.

ఆకట్టుకున్న నఖచిత్రం





గరుగుబిల్లి: సంక్రాంతి పురస్కరించుకుని, మండలంలోని నాగూరుకు చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు ఆదివారం గీసిన పొట్టలక్ష్మి నఖచిత్రం చూపరులను ఆకట్టుకుంటోంది. పండగ బట్టలు అల్లుడికి అవసరమని, తెలియజేస్తూ ఆయన రూపొందించిన మరో వ్యంగ్య వర్ణచిత్రం నవ్వులు పూయిస్తోంది.

వైఎస్సార్ సీపీలోకి ఒకటో వార్డు కౌన్సిలర్

పార్వతీపురంటౌన్: స్థానిక పురపాలక సంఘం ఒకటో వార్డు కౌన్సిలర్ రణభేరి బంగారినాయుడు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో పార్టీలో చేరిన ఆయన పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ విధివిధానాలు, సీఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన నచ్చే తాను పార్టీలోకి వస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరినీ పార్టీ అక్కున చేర్చుకుని, అండగా నిలుస్తుందన్నారు. అందరూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

రామతీర్థంలో సంక్రాంతి సంబరాలు



చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన అనంతరం అర్చకులు ఉత్తర రాజగోపురం వద్ద సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భోగి మంట వేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చిన్నారులపై భోగిపళ్లను పోసి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. భోగి రోజున చిన్నారులపై భోగిపండ్లు పోయడం వల్ల మహావిష్ణువు ఆశీస్సులు లభిస్తాయని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ. కిషోర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సంప్రదాయానికి ప్రతిబింబం రంగవల్లులు




రంగోలి పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం టౌన్: సనాతన హైందవ సంప్రదాయానికి ప్రతిబింబం రంగవల్లులని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. కళలకు కాణాచి, పుట్టినిల్లు అయిన విజయనగరంలో సంస్కృతీ, సంప్రదాయాలు ఫరిఢవిల్లుతున్నాయని చెప్పారు. వాజీ చానల్ నిర్వహించిన రంగోలీ, మెగా హోసీ లక్ష్మీడ్రా విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలలో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికితీయడమే కాకుండా సంప్రదాయాలు, సంస్కృతిని గౌరవించేలా వ్యవహరిస్తున్న వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు స్ఫూర్తిప్రదాతని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వాజీ చానల్ ఎం.డి శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయనగరం ప్రజల్లో వాజీ చానల్ రంగోలి పోటీలు అంతర్భాగమైపోయాయన్నారు. ఈ ఏడాది హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, నెల్లూరు, విశాఖ నుంచి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారన్నారు. రంగోలి పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో ఉమాదేవి, బి.మాధవి, ప్రత్యూషలు నిలిచారని చెప్పారు. అనంతరం మెగా హోసీ లక్కీడ్రా విజేతలకు బహుమతులందించారు. ఈ సందర్భంగా నర్తనశాల, అమృత శ్రీవర్షిణి స్కూల్ ఆఫ్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ విద్యార్థుల ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గజపతినగరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కేఏ నాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, గుండమ్మ కథ సీరియల్ నటి పూజామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కడలి అలలపై.. గంగపుత్రుల జీవన నావ

- సముద్రంలో చేపల వేట.. మత్స్యకారుల జీవనాధారం
- విపత్కర పరిస్థితులనైనా తట్టుకునే శక్తి వీరి సొంతం
- వైఎస్సార్ సీపీ సర్కారుతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు
- సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలతో మారిన జీవనప్రమాణాలు



సంద్రంలో వేటకు బయలుదేరుతున్న మత్స్యకారులు

పూసపాటిరేగ: అనునిత్యం కడలి(సముద్రం)అలలకు ఎదురేగి జీవనపోరాటం సాగిస్తారు మత్స్యకారులు. కుటుంబ పోషణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి, నిద్రలేచింది మొదలు వేట సామగ్రితో సముద్రంలోకి బయలుదేరుతారు. సాగరంలో చేపలు పట్టి, వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో తమ కుటుంబాలను పోషించుకుంటారు. అవసరమైనంత మత్స్య సంపద దొరికేంత వరకు ఎన్నిరోజులు అయినా వేట కొనసాగిస్తారు. సంద్రంలో ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదురొడ్డి, నిలబడతారు. గతంలో టీడీపీ హయాంలో మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. ఇప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం గంగపుత్రులను అన్నివిధాలా ఆదుకుంటోంది. సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలు అందిస్తూ వారి జీవనప్రమాణాలు మెరుగుపరిచింది.

మత్స్యకారుల జీవితాల్లో సమూల మార్పులు..

2014 నుంచి 2018 వరకు మరపడవలపై దాడులు, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలు, ఇంకో వైపు నుంచి సాయం చేయకుండా హామీలను గాలికొదిలేసి ముఖం చాటేసిన పాలకులతో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంప్రదాయ మత్స్యకారుల ఆకలి ఘోషను దగ్గరగా చూసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన నాలుగు న్నరేళ్లలో విప్లవాత్మకమైన మార్పులతో గంగపుత్రుల జీవితాల్లో అభివృద్ధి వెలుగులు నింపారు. మత్స్యకార భరోసాను రూ.4 వేల నుంచి రూ.10 వేలకు, మత్స్యకార ప్రమాద బీమాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం, డీజిల్ సబ్సిడీ రూ.6.05 నుంచి రూ.9లకు పెంచడం, 50 ఏళ్లకే మత్స్యకారులకు పింఛన్ అందిస్తుండడంతో వారి జీవితాల్లో సమూలమైన మార్పులు వచ్చాయి. ఆక్వాకల్చర్ చేసుకోవడానికి ఒక్కో యూనిట్‌కు రూ.5 లక్షలు, చేపలు అమ్ముకోవడానికి మోటార్ సైకిల్, మూడుచక్రాల వాహనాల కొనుగోలుకు రూ.3 లక్షలు, కొత్తబోటు, వలలు కొనుగోళ్లకు రూ.5 లక్షలలో 40 శాతం సబ్సిడీ వంటి సదుపాయాలను జగనన్న సర్కారు అందించడంతో మత్స్యకారుల ఆనందంగా జీవిస్తున్నారు.

వేటకు బయలుదేరే ముందు..

అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత భార్యాబిడ్డలను ఒకసారి పలకరించి, సముద్రం ఒడ్డుకు చేరుతారు. మత్స్యసంపద లభ్యమయ్యే ప్రదేశాలు ఎక్కడెక్కడ ఉంటాయో చర్చించుకుంటారు. వేటకు బయలుదేరే ముందు తమ ఇష్టదైవాన్ని తలుచుకుని, కడలిలోకి ప్రవేశిస్తారు. సాధారణ వలకు ముగ్గురు, రింగుల వలకు ఏడుగురు, వంజిరం వల వేటకు 10 మంది చొప్పున మత్స్యకారులు వేటకు వెళ్తారు. వేట చేయగా వచ్చిన చేపలను మత్స్యకార మహిళలు గ్రామాల్లో అమ్ముతారు. ఎక్కువ చేపలు అయితే విశాఖపట్నంలో దళారులను ఆశ్రయించి, అమ్ముతారు.

మత్స్యకారులకు మంచి రోజులు..

జిల్లాలోని తీరప్రాంతాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లోని 19 తీరప్రాంత గ్రామాల్లో మొత్తం 20 వేల మంది మత్స్యకారులు జీవిస్తున్నారు. వీరిలో 6 వేల మంది వేటపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలోని తీరప్రాంతాల్లోని మత్స్యకారుల్లో సగానికి పైగా వేటసాగక వలస వెళ్తున్నవారే. ఇటీవల విజయనగరంలో తీర ప్రాంతానికి ఫ్లోటింగ్ జెట్టీ మంజూరు చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసి, వర్చువల్ విధానంలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో వేటక సాగక వలసలు వెళ్లే మత్స్యకారులకు సొంత గ్రామంలోనే వేటసాగే అవకాశం కలుగుతుంది. ఫ్లోటింగు జెట్టీ నిర్మాణం పూర్తయితే మత్స్యకారుల వలసలకు పూర్తి స్థాయిలో బ్రేక్ పడినట్లే.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలోని అనేకమంది గంగపుత్రులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, ప్రోత్సాహకాలు, ఆర్థికసాయం అందుతోంది. ప్రధానంగా పీఎం మత్స్య సంపద పథకం ద్వారా మత్స్యకారులకు లాభం చేకూరుతోంది.

– చాందినీ, ఎఫ్‌డీవో మత్స్యశాఖ, విజయనగరం.

వైభవంగా గోదాదేవి కల్యాణం



ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో గోదాదేవి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఏటా ధనుర్మాస ముగింపును పురస్కరించుకొని భోగి పండగ నాడు గోదాదేవి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.. ఇందులో భాగంగా గోదా అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ పల్లకిలో ఊరేగించారు. అనంతరం రామకోనేరు వద్ద అమ్మవారి విగ్రహానికి నలుగు పూసి స్నానం చేయించారు. గోదాదేవిని పెళ్లి కుమార్తెలా అలంకరించి దేవాలయానికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. రామ సన్నిధిలో ప్రత్యేక పూజలనంతరం గోదాదేవికి శ్రీకృష్ణపరమాత్ముడితే కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఈఓ. కిషోర్‌కుమార్, అర్చకులు సాయిరామాచార్యులు, వరప్రసాద్, రామగోపాల్, భక్తులు పాల్గొన్నారు.